క్లుప్తంగా...

సబ్సిడీపై విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి

మేడ్చల్: సబ్సిడీపై జనుము, జీలుగ విత్తనాలను సరఫరా చేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి అర్చన తెలిపారు. మండల పరిధిలోని పూడూర్, మేడ్చల్ సహకార సంఘాల్లో విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 40 కిలోల ధర రూ.3,500 ఉండగా సబ్సిడీపై రూ.1,225, 40 కిలోల జీలుగకు రూ.2,407 ధర ఉండగా సబ్సిడీపై రూ.843కు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. రైతులు తమ పట్టా పాస్‌బుక్, ఆధార్ కార్డుల జిరాక్స్‌లను అందజేసి సబ్సిడీ విత్తనాలను పొందాలన్నారు.

ఈఎంఆర్ఐలో ఉద్యోగావకాశాలు

మేడ్చల్: గుండ్లపోచంపల్లిలోని ఈఎంఆర్ఐ జీహెచ్ఎస్ సంస్థ ఆధ్వర్యంలో 102, 108 అంబులెన్స్ డ్రైవర్లు, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నిషియన్ పోస్టుల భర్తీకి సంస్థ ప్రోగ్రాం మేనేజర్ జాన్ షాహిద్ దరఖాస్తులను ఆహ్వానించారు. ఈ నెల 20వ తేదీన మేడ్చల్ ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలోని 108 కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డ్రైవర్ల పోస్టుకు కనీసం పదవ తరగతి పాసై, 23 నుంచి 35 సంవత్సరాలలోపు వయస్సుతో పాటు బ్యాడ్జి నెంబర్‌తో కలిపి లైసెన్స్ ఉన్నవారు అర్హులని తెలిపారు. మెడికల్ టెక్నిషియన్ పోస్టుల కోసం 23 నుంచి 30 ఏళ్లలోపు వయస్సు ఉండి సైన్స్ డిగ్రీ, డీఎంఎల్‌టీ, బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎమ్‌లలో ఏదైనా డిగ్రీ ఉండాలని తెలిపారు. అభ్యర్థులు ఈనెల 20 తేదీన పత్రాలతో కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. వివరాలకు ఫోన్: 91007 99264.

శ్రీరామలింగేశ్వర స్వామి సేవలో..



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న జ్యోతి

కీసర: కీసరగుట్ట స్వామి సేవలో ఎండోమెంట్ అడిషనల్ జాయింట్ కమిషనర్(ఏడీసీ) జ్యోతి మంగళవారం పాల్గొన్నారు. ఉదయం ఆలయానికి విచ్చేసిన ఏడీసీ జ్యోతికి ఆలయ వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. గర్భాలయంలో కొలువుదీరిన శ్రీస్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితులు రామలింగేశ్వర స్వామివారి ఆశీర్వచనంతో పాటు మహాప్రసాదాన్ని అందజేశారు. ఆలయ చైర్మన్ తటాకం రమేష్‌శర్మ, ఈఓ ఏ.నరేందర్, ఫౌండర్ ఫ్యామిలీ సభ్యులు, తటాకం నారాయణ, తటాకం ఉమాపతి, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గౌడవెల్లి వద్ద అండర్ పాస్ బ్రిడ్జి కోసం స్థల పరిశీలన



మేడ్చల్: మండలంలోని గౌడవెల్లి పరిధిలో రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణం కోసం రైల్వే అధికారులు సర్పంచ్ సురేందర్‌ముదిరాజ్‌తో కలిసి స్థల పరిశీలన చేశారు. గౌడవెల్లి వద్ద రైల్వే ట్రాక్ ఉండటం, స్టేషన్ వద్ద గేట్ ఉండటం, ఔటర్ రింగు రోడ్డు సర్వీసు రోడ్డు వద్ద బ్రిడ్జి లేకపోవడంతో అసంపూర్తిగా నిలిచిపోయింది. దీంతో రైల్వే అధికారులు అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణం చేసేందుకు సన్నద్ధం అయ్యారు. ఈ మేరకు అధికారులు స్థల పరిశీలన చేశారు. సికింద్రాబాద్ రైల్వే డివిజన్ సీనియర్ సెక్షన్ ఇంజనీర్ రవిప్రకాష్, సిబ్బంది కలిసి స్థల పరిశీలన చేశారు.

సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యం

డీసీసీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్



అల్వాల్: అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యమని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ అన్నారు. మంగళవారం మచ్చబొల్లారం డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో 52వ రోజు హాథ్ సే హాథ్ జోడో అభియాన్ యాత్రను ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పాదయాత్రలో ఇంటింటికీ తిరుగుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన ధరలు తగ్గిస్తామన్నారు. గ్యాస్ సిలిండర్ ధర రూ.500లకే అందజేస్తామని చెప్పారు. నిరుద్యోగ భృతి కల్పిస్తామన్నారు. యువకులకు ఉద్యోగ భద్రత ఉంటుందన్నారు. ఇటీవల కర్ణాటకలో వెలువడిన ఫలితాలే రాష్ట్రంలో వస్తాయన్నారు.

ఇష్టంగా తినేలా..

- అంగన్‌వాడీ కేంద్రాలకు సన్నబియ్యం పంపిణీకి కసరత్తు
- ప్రభుత్వ నిర్ణయంతో జూన్ నుంచి సరఫరా చేసేలా..
- మేడ్చల్ జిల్లాలో 733 కేంద్రాల్లో 1.01 లక్షల మంది లబ్ధిదారులు
- చిన్నారులు, గర్భిణులు, బాలింతల మేలుకోరి పంపిణీకి శ్రీకారం





సాక్షి, మేడ్చల్ జిల్లా: అంగన్‌వాడీ కేంద్రాలకు జూన్ నుంచి సన్నబియ్యం సరఫరా చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. చిన్నారులు, బాలింతలు, గర్భిణులు పౌష్టికాహార లోపంతో బాధపడకుండా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాహారం అందించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఆటపాటలు, పూర్వ ప్రాథమిక విద్యతో పాటు గుడ్లు, పాలు, బాలామృతం, మధ్యాహ్న భోజనం, చిరుతిండ్లు అందిస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. భోజనం మాత్రం దొడ్డు బియ్యంతో తయారు చేస్తుండటంతో గర్భిణులు, బాలింతలు ఇబ్బందులు పడుతున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం అంగన్‌వాడీలకు సన్నబియ్యం అందించేలా నిర్ణయం తీసుకుంది. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా జూన్ నుంచి అంగన్‌వాడీ కేంద్రాలకు సన్నబియ్యం సరఫరా చేయనున్నారు.

దొడ్డు బియ్యం భోజనం ఇష్టం లేక..

అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రస్తుతం చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు కోడిగుడ్లు, పాలు, బాలామృతం, పప్పులు తదితర పౌష్టికాహారంతో పాటు నిత్యం దొడ్డు బియ్యంతో భోజనం తయారు చేస్తున్నారు. పాలు, గుడ్లు, బాలామృతం వినియోగిస్తున్నంత ఇష్టంగా దొడ్డు బియ్యం భోజనాన్ని లబ్ధిదారులు తీసుకోవడం లేదని నిర్వాహకులు పేర్కొంటున్నారు. వసతి గృహాలు, పాఠశాలల్లో మధ్యాహ్న భోజనానికి సన్న బియ్యం అందించి అంగన్‌వాడీ కేంద్రాలకు మాత్రం దొడ్డు బియ్యం సరఫరా చేస్తున్నారనే విమర్శలూ ఉన్నాయి. దీంతో ప్రభుత్వం తాజాగా తీసుకున్న నిర్ణయంతో అంగన్‌వాడీ కేంద్రాలకు జూన్ నుంచి సన్నబియ్యం పంపిణీ చేయనుండటంతో మరింత ఇష్టంగా భోజనం చేసేందుకు లబ్ధిదారులు ముందుకు వస్తారని సంబంధిత శాఖ అధికారులు చెబుతున్నారు.

733 కేంద్రాలు 1.01 లక్షల మంది లబ్ధిదారులు

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 733 అంగన్‌వాడీ కేంద్రాలలో 1,01,419 మంది లబ్ధిదారులు ఉండగా, ఇందులో చిన్నారులు 78,087 మంది, గర్భిణులు, బాలింతలు 23,332 మంది ఉన్నారు. ప్రతి నెలా సరాసరి ఒక్కో కేంద్రానికి 55 నుంచి 60 కిలోల బియ్యం పంపిణీ జరుగుతున్నట్లు తెలుస్తోంది. దొడ్డు బియ్యం భోజనాన్ని చిన్నారులకు ఒక్కొక్కరికి 75 గ్రాములు, బాలింతలు, గర్భిణులకు 150 గ్రాముల చొప్పున వండి వడ్డిస్తున్నారు.

ఆదేశాలు రాగానే పంపిణీ

అంగన్‌వాడీ కేంద్రాలకు జూన్ నుంచి సన్నబియ్యం సరఫరా చేయాలని ప్రభుత్వం నిర్ణయించడం ఆనందంగా ఉంది. ప్రభుత్వ ఆదేశాలు రాగానే అంగన్‌వాడీ కేంద్రాలకు సన్న బియ్యం పంపిణీ చేస్తాం. లబ్ధిదారులు సన్నబియ్యం భోజనాన్ని తినడానికి అవకాశం ఉంటుంది.

– అక్కేశ్వర్‌రావు, ఇన్‌చార్జ్ డీడబ్ల్యూవో, మేడ్చల్ జిల్లా.

పెండింగ్ పనులు పూర్తిచేస్తాం

– మంత్రి మల్లారెడ్డి



కీసరలో నిర్వహించిన ర్యాలీలో మంత్రి మల్లారెడ్డి తదితరులు

కీసర: బీఆర్ఎస్ ప్రభుత్వం పేదల ఆరోగ్యానికి పెద్దపీట వేసిందని, ఇందుకోసం సుమారు రూ.10 వేల కోట్ల వరకు బడ్జెట్‌ను వైద్యరంగం కోసం కేటాయించినట్లు మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. జాతీయ డెంగీ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం కీసర పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ సరితారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డెంగీ వ్యాప్తికి చెక్ పెట్టేందుకు ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు దోమలు వృద్ధి చెందకుండా చర్యలు చేపట్టాలన్నారు. దోమకాటు విషపూరితమైందని, వర్షాకాలంలో ఇళ్ల ముందు మురుగు, చెత్త చెదారం పేరుకుపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తెలంగాణను ఆరోగ్య తెలంగాణగా మార్చేందుకు వైద్య ఆరోగ్యశాఖ చేపడుతున్న చర్యలకు ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ డెంగీని నివారించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించడమే ర్యాలీ ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇందిరాలక్ష్మీనారాయణ, జెడ్పీవైస్ చైర్మన్ బెస్త వెంకటేష్, వైస్‌ఎంపీపీ జె.సత్తిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రామిడి ప్రభాకర్‌రెడ్డి, సర్పంచులు మాధురి, మహేందర్‌రెడ్డి, ధర్మేందర్, రాజు, డాక్టర్ రఘునాథస్వామి, సంధ్య, సరస్వతి, కౌశిక్, శేషపద్మ, బస్తీదవాఖానా, పల్లె దవాఖానా, వైద్యులు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు తటాకం నారాయణ, నేతలు తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబాలకు ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న కృష్ణగౌడ్, అర్జున్

ఘట్‌కేసర్: ఘనాపూర్‌లో ఇటీవల మరణించిన వారి కుటుంబీకులకు మల్లారెడ్డి ట్రస్ట్ అండగా నిలిచింది. గ్రామానికి చెందిన జంగమ్మ, శ్రీరాములుగౌడ్ కుటుంబీకులను మంత్రి మల్లారెడ్డి ఆదేశానుసారం స్థానిక టీఆర్ఎస్ నాయకులు మంగళవారం బాధితుల నివాసానికి వెళ్లి పరామర్శించారు. అనంతరం ఒక్కో కుటుంబానికి రూ.5 వేల చొప్పున రూ.10 వేలను అందజేశారు. కార్యక్రమంలో రాజుగౌడ్, శరత్‌గౌడ్, మాజీ ఉప సర్పంచ్ అర్జున్, మాజీ వార్డు సభ్యుడు కృష్ణగౌడ్, కుమార్, ప్రవీణ్, సాయి, మల్లికార్జున్, బద్రినాయక్, మల్లారెడ్డి ట్రస్ట్ సభ్యుడు వేణు పాల్గొన్నారు.

జీవాలకు టీకాలు వేయించాలి

మేడ్చల్: గొర్రెలు మేకలకు పెంపకందారులు తప్పనిసరిగా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని జిల్లా గొర్రెల మేకల పెంపకందారుల సంఘం అధ్యక్షుడు కొమురయ్య కోరాడు. మండలంలోని రావల్‌కోల్ గ్రామంలో గొర్రెలకు, మేకలకు చిటకె వ్యాధి నిరోధక టీకాలు వేశారు. జీవాలకు చిటికె రోగం సోకకుండా ముందుగానే వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని సూచించారు. టీకాలు పశువైద్య కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని, వైద్యులు ఉచితంగా అందజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో వైద్యులతో పాటు సంఘం నాయకులు ఆనంద్, శ్రీనివాస్, గణేష్, తిరుపతి తదితరులు ఉన్నారు.



టీకాలు వేస్తున్న సంఘం నాయకులు

అక్రమ నిర్మాణాల కూల్చివేత



కొండాపూర్ సీలింగ్ భూమిలో కొనసాగుతున్న కూల్చివేతలు

ఘట్‌కేసర్: మున్సిపాలిటీ పరిధిలోని కొండాపూర్ సర్వే నంబర్–117లోని సీలింగ్, అసైన్డ్ భూమిలో నిర్మించిన అక్రమ నిర్మాణాలను రెవెన్యూ, మున్సిపల్ అధికారులు మంగళవారం కూల్చివేయించారు. ప్రభుత్వం గతంలో కేటాయించిన భూమిలో లబ్ధిదారులు వ్యవసాయం చేయకుండా ఇతరులకు విక్రయించడంతో కొనుగోలుదారులు అక్రమంగా నిర్మాణాలు చేపట్టారు. సమాచారం తెలుసుకున్న తహసీల్దార్ విజయలక్ష్మీ, కమిషనర్ మేమనరెడ్డి ఆధ్వర్యంలో సిబ్బందితో అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. ఎస్సై అశోక్ తమ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు.

బీజేపీ ఇంటింటి ప్రచారం



మేడ్చల్: మరోసారి మోదీ సర్కార్.. తెలంగాణలో ఈసారి బీజేపీ ప్రభుత్వం పేరుతో బీజేపీ చేపట్టిన ఇంటింటికీ కమలం పువ్వు కార్యక్రమాన్ని పట్టణ బీజేపీ నాయకులు మంగళవారం మేడ్చల్‌లో నిర్వహించారు. నాయకులు పట్టణంలో ఇంటింటికీ వెళ్లి గోడలపై కమలం గుర్తు ఏర్పాటు చేసి అందులో మరోసారి మోదీ సర్కార్.. తెలంగాణలో ఈసారి బీజేపీ ప్రభుత్వం అని రాశారు. కాలనీల్లో ప్రజలను కలిసి బీజేపీ విజయాలు, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ప్రేందాస్, జిల్లా ఉపాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, నాయకులు వెంకటేష్, అర్జున్, కేశవరెడ్డి రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హరితహారంలో 30 వేల మొక్కలు నాటుతాం



నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న సర్పంచ్ సురేందర్‌ముదిరాజ్

మేడ్చల్: మండలంలోని గౌడవెల్లి గ్రామ పరిధిలో హరితహారంలో 30వేల మొక్కలను నాటుతామని గ్రామ సర్పంచ్ సురేందర్‌ముదిరాజ్ అన్నారు. గ్రామ పరిధిలోని నర్సరీలను పరిశీలించి అన్ని మొక్కలను సిద్ధం చేసినట్లు తెలిపారు. గతంలో హరితహారంలో వెల మొక్కలు నాటి పరిరక్షించామని, ఈసారి గ్రామపరిధిలో అధికంగా పూల మొక్కలు నాటుతామని తెలిపారు. వర్షాలు మొదలవగానే మొక్కలను నాటడం ప్రారంభిస్తామని తెలిపారు.

20 నుంచి మేరా లైఫ్-మేరా స్వచ్ఛ్ షెహర్



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ వాణిరెడ్డి

కీసర: మేరా లైఫ్–మేరా స్వచ్ఛ్ షెహర్‌లో భాగంగా ఆర్‌ఆర్‌ఆర్ కేంద్రాల స్థాపనపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతివార్డులో రెడ్యూస్ రీయూజ్ రీసైకిల్‌కు సంబంధించిన కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని, వీటి ఉపయోగం గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తామని కమిషనర్ వాణి రెడ్డి తెలిపారు. ఈ నెల 20 నుంచి వచ్చేనెల 5 వరకు కార్యక్రమం కొనసాగుతుందన్నారు. పాడి చెత్తకు సంబంధించిన అన్ని రకాల ప్లాస్టిక్ వస్తువులు, వినియోగంలో లేని దుస్తులు, షాంపూ కవర్ల నుంచి పుస్తకాల వరకు వస్తువులను ఆర్‌ఆర్‌ఆర్ వద్దకు తీసుకురావాలని సూచించారు. మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రజలందరూ సహకరించాలని కోరారు. వైస్‌చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్, కౌన్సిలర్లు మున్సిపల్ మేనేజర్ చంద్రశేఖర్, డిప్యూటీ ఇంజనీర్ సుదర్శన్ రఘు, శానిటరి ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ ప్రశాంత్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి



ఓపెన్ నాలా పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ బండారు శ్రీవాణి

రామంతాపూర్: వర్షాకాలం మొదలయ్యే లోపే డివిజన్‌లో వివిధ కాలనీలు, బస్తీల్లో జరుగుతున్న ట్రంక్ లైన్ బాక్స్‌డ్రైన్, ఓపెన్ నాలాల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని డివిజన్ కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకటరావు అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక రాంశంకర్‌నగర్‌లో నిర్మిస్తున్న ఓపెన్ నాలా పనులను ఆమె జీహెచ్‌ఎంసీ ఈఈ నాగేందర్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాలు మొదలు కాకముందే ఈ పనులు పూర్తి చేయాలని, లేకపోతే ప్రమాదకరంగా మారే పరిస్థితి ఏర్పడుతుందని ఆమె అన్నారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేందర్, బీజేపీ నేతలు బండారు వెంకటరావు, నారాయణదాసు తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు చేయూత

కుషాయిగూడ: ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఉన్నత చదువులు చదవలేని పేద విద్యార్థులకు పాతుకూచి సోమసుందర సామాజిక సేవా, దాతృత్వ సంస్థ ప్రతినిధులు చేయూత అందిస్తున్నారు. చర్లపల్లి పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి పాసై పాలిసెట్ రాసేందుకు ఫీజు కట్టలేని సుమారు 200 మంది విద్యార్థులకు ఫీజులు చెల్లించి తోడ్పాటు అందించారు. చర్లపల్లిలోని సంస్థ కార్యాలయంలో మంగళవారం విద్యార్థులకు హాల్‌టికెట్లను అందజేశారు. నగరంలో 12 కేంద్రాల్లో ప్రతి సంవత్సరం వందల మంది విద్యార్థులకు ఫీజులు చెల్లిస్తున్నట్లు ట్రస్టు నిర్వాహకుడు రాము తెలిపారు.



రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలి

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ అమయ్ కుమార్



సాక్షి, మేడ్చల్ జిల్లా: రోడ్డు భద్రతతో పాటు ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించి ప్రమాదాలు జరగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అమయ్ కుమార్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రోడ్డు భద్రతలపై రోడ్డు, భవనాలు, పంచాయతీరాజ్, జిల్లా రవాణాశాఖ, భారత జాతీయ రహదారుల సంస్థ(ఎన్‌హెచ్‌ఏఐ), పోలీసు, ట్రాఫిక్ పోలీసులు, ఆర్టీసీ, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత శాఖలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అమయ్ కుమార్ మాట్లాడుతూ మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా నేషనల్ హైవేలు ఉన్నాయని, ఆయా ప్రాంతాల్లో ఎక్కడా ప్రమాదాలు జరగకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతిఒక్కరూ రోడ్డు నిబంధలను పాటించేలా చూడాలని, అధికారులు కూడా బ్లాక్ స్పాట్లుగా గుర్తించిన ప్రాంతాల్లో రుంబుల్ స్ట్రిప్స్, స్టడ్స్, సూచిక బోర్డులు, బ్లింకర్స్ వంటివి ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ, రాష్ట్ర రహదారుల ఇంజనీరింగ్ అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాల్సిందిగా ఆయన అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారి, రాజీవ్ రహదారితో పాటు పలు రహదారులపై స్పీడ్ లిమిట్స్ బోర్డులు, స్పీడ్ గన్స్ ఏర్పాటు చేయాల్సిందిగా తెలిపారు. గతంలో ఎక్కువ రోడ్డు ప్రమాదాలు జరిగిన చోట్ల, రహదారుల వద్ద మూలమలుపులు, పాఠశాలలు, కళాశాలల వద్ద సిగ్నల్ బోర్డులను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. సమీక్ష సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య, జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యానాయక్, ఆర్‌అండ్‌బీ ఈఈ శ్రీనివాసమూర్తి, ఆర్టీవో కిషన్ నాయక్, పంచాయతీరాజ్ ఈఈ రామ్మోహన్, పోలీసు, ట్రాఫిక్, మున్సిపల్ కమిషనర్లు, జాతీయ రహదారుల సంస్థ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలకు ఏర్పాట్లు చేయాలి

సాక్షి, మేడ్చల్ జిల్లా: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించేలా అన్ని శాఖలు అవసరమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అమయ్ కుమార్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో ఆయన ముందస్తు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి ప్రభుత్వం ఇప్పటికే చేపట్టాల్సిన కార్యక్రమాలపై ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని జిల్లాలో పదేళ్లలో చేపట్టిన అభివృద్ధి, సాధించిన విజయాలు తదితర సమగ్ర సమాచారం జిల్లా అధికారులు సేకరించుకోవాలని అధికారులకు సూచించారు. సమీక్ష సమావేశంలో మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్లు అభిషేక్ అగస్త్య, జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యానాయక్, కలెక్టరేట్ ఏఓ వెంకటేశ్వర్లు, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చెరువులో పడి యువకుడి మృతి

మేడ్చల్: మండలంలోని పూడూర్ మొగుళ్ల కుంటలో యువకుడు ప్రమాదవశాత్తు పడి మృతి చెందాడు. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం గ్రామంలో నివాసముండే బానోత్ శ్రీను(27) మొగుళ్లకుంట నీటిలో శవమై తేలాడు. శ్రీను ఐదేళ్లుగా పూడూర్‌లో నివాసముంటూ మేస్త్రీ పనిచేస్తున్నాడు. చెరువు వద్దకు శ్రీను తన ద్విచక్రవాహనంపై చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడ్డాడు. నీటిలో మునిగి మృతి చెందాడు. నీటిపై మృతదేహం తేలుతోందని స్థానికులు పోలీసులకు తెలిపారు. పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని మార్చురీకి తరలించారు.

సమస్యలను పరిష్కరించాలని వినతి

– ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తూ..

రామంతాపూర్: గ్రేటర్ సత్యానగర్ సంక్షేమ సంఘం ప్రతినిధులు మంగళవారం క్యాంపు కార్యాలయంలో ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డిని కలిసి తమ కాలనీలో భూగర్భ డ్రైనేజీ లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, మురుగు రోడ్లపై పారుతోందని వెంటనే భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభించాలని వినతి పత్రం సమర్పించారు. అందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ త్వరలోనే పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను పూర్తి చేస్తామని, అందులో భాగంగా సత్యానగర్‌లో నూతనంగా భూగర్భ డ్రైనేజీని నిర్మిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జేఎం శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు ఆర్కేరెడ్డి, శివకుమార్, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్ దయానంద్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.